క్లుప్తంగా

ముందస్తు అడ్మిషన్లు ఆపండి



ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మడకశిర: మండలంలో కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్నాయని, వెంటనే ఆపాలని గురువారం ఎంఈఓ భాస్కర్‌కు పలు సంఘాల నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఉమేష్‌నాయక్, డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతు, సీపీఐ ఇన్‌చార్జ్ పవిత్ర మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పలు ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్నాయన్నారు. సదరు విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మడకశిరలో కర్ణాటక మంత్రి పర్యటన



మంత్రిని సన్మానిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

మడకశిర: పట్టణంలో గురువారం కర్ణాటక సహకారశాఖ మంత్రి రాజన్న పర్యటించారు. ఆయన పావగడ పర్యటనకు వచ్చిన నేపథ్యంలో పట్టణంలోని వాల్మీకి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మంత్రికి స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, వాల్మీకి సంఘం ప్రతినిధులు స్వాగతం పలికారు. ఈసందర్భంగా మంత్రిని వాల్మీకి సంఘం నాయకులు సన్మానించారు. పలువురు స్థానిక నాయకులు, వాల్మీకి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఈఓఆర్డీగా సుధాకర్



అమరాపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఈఓఆర్డీగా సుధాకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈఓఆర్డీగా ఉన్న నాగముని పదవీ విరమణ కావడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు అమరాపురం మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌ను ఇన్‌చార్జ్ ఈఓఆర్డీగా నియమించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ ఎంపీడీఓ రామరావుతో కలసి సచివాలయం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో వుండి పారిశుద్యం, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

అనారోగ్యంతో ఈఓఆర్డీ మృతి



ఈఓఆర్డీ శ్రీధర్ (ఫైల్)

పరిగి: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఈఓఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీధర్(52) అనారోగ్య కారణాలతో గత బుధవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న కార్యాలయ సిబ్బంది, ఎంపీపీ సవిత, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన కుటుంబానికి సానుభూతిని ప్రకటించారు. కాగా ఆయన గత కొన్ని నెలలుగా పరిగి మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పని చేశారు. గత ఏప్రిల్‌లో ఆయన వెన్ను నొప్పి కారణంగా సెలవుపై వెళ్లారు. శుక్రవారం తిరిగి విధుల్లో చేరుకోవాల్సి ఉండగా బుధవారం ఆయన మృతిచెందారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



గాయపడిన రామాంజనమ్మ

పరిగి: మండల కేంద్రంలోని నేషనల్ హైవే 544ఈఈపై గురువారం జరిగిన ప్రమాదంలో రామాంజనమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికుల వివరాల మేరకు.. హిందూపురం మండలంలోని శ్రీకంఠాపురానికి చెందిన రామాంజనమ్మ పని నిమిత్తం మండలంలోని పైడేటికి తన బంధువుతో కలిసి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారి పైడేటి సర్కిల్‌పై మడకశిర వైపు నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



పంచాయతీరాజ్ అతిథి గృహం

శిథిలావస్థలో పీఆర్ అతిథి గృహం

పెనుకొండ: పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహం గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. గతంలో ఎంతో మంది ప్రముఖ నాయకులు, అధికారులు ఇక్కడ సేద తీరారు. నేడు చిన్నపాటి మరమ్మతులను పట్టించుకోకపోవంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. గత 10 సంవత్సరాలుగా ప్రభుత్వ అతిథి గృహం దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. ఆవరణం మొత్తం చెత్తా చెదారంతో నిండిపోయింది. దీంతో పట్టణంలో అధికారులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు సమావేశాలు నిర్వహించుకోవడానికి లేదా ప్రెస్ మీట్లు పెట్టుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో.. దారినపోయే ప్రతి ఒక్కరూ పీఆర్ అతిథి గృహం దుస్థితి చూసి విచారం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అతిథి గృహాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్.కొట్టాల సరిహద్దు వద్ద ప్రధాన రహదారి పక్కనే తవ్విన కేబుల్ గుంత

తవ్వారు..వదిలేశారు!

రొద్దం: మండలంలోని ఆర్.కొట్టాల గ్రామ సమీపాన కార్ణటక సరిహద్దు వద్ద కేబుల్ ఏర్పాటు కోసం రోడ్డుకు అనుకుని గుంతలు తవ్విన నిర్వాహకులు.. వాటిని పూడ్చి పెట్టకుండా వదిలేయడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. పావగడ-పెనుకొండ రహదారిపై వాహనాలు రాకపోకలు అధికంగా ఉటాయి. రాత్రి వేళలలో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని వాహన చోదకులు వాపోతున్నారు. మూడు నెలల రోజుల క్రితం ఓ ప్రైవేట్ కంపెనీ వారు ఫైబర్ నెట్ కోసం రోడ్డుకు ఇరువైపులా గోతులు తవ్వి కేబుల్ వేశారు. అయితే అక్కడక్కడా కేబుల్ వేసి గుంతులు పూడ్చకపోవడంతో రాత్రి పూట ద్విచక్ర వాహనాలు దారులు మట్టి దిబ్బలను ఢీకొని గాయపడుతున్నారు. పావగడ-పెనుకొండ ప్రధాన రహదాకి పక్కన గోతులు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.



మణూరు-కల్లుమర్రి రోడ్డుపై కూలిన కల్వర్ట్

ఆదమరిస్తే అంతే..

మడకశిరరూరల్: మణూరు ఉన్నత పాఠశాల సమీపంలోని మణూరు- కల్లుమర్రి రహదారిపై గతంలో కురిసిన వర్షాలకు కల్వర్ట్ కూలిపోయింది. అప్పటి నుంచి వాహనదారులు పక్క వైపు నుంచి రోడ్డుపైకి వస్తున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు ఏమాత్రం అజాగ్రత వహించిన ప్రమాదం జరిగే ఆవకాశం ఉంది. వర్షాకాలంలో వర్షాలు కురిసి వంక ప్రవహిస్తే ఆ రోడ్డుపై గ్రామాల ప్రజలు, వాహనదారులు వెళ్లాడానికి ఇబ్బందిగా ఉంటుంది. సంబంధిత అధికారులు వర్షాకాలం ప్రారంభంలోపే కల్వర్ట్ నిర్మాణం చేపట్టాలని మణూరు, కల్లుమర్రి గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

గోరంట్ల: గోరంట్ల మండలంలో అగ్నిమాపక కేంద్రం లేక ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న కోరారు. అధికారులు వెంటనే స్పందించి గోరంట్ల మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని గురువారం తహసీల్దార్ మారుతి ప్రసాద్‌కు విన్నవించారు. మండలంలో 110 గ్రామాలు ఉన్నాయని, అగ్ని ప్రమాదాలు జరిగితే 30 కిలోమీటర్ల దూరంలోని పుట్టపర్తి నుంచి అగ్నిమాపక వాహనం రావాల్సిందన్నారు. ఫైర్ ఇంజిన్ వచ్చే లోపు జరగాల్సిన నష్టం జరిగిపోవడంతో ప్రజలు తీవ్రంగా నష్టపోవాల్సిన దుస్థితి నెలకొందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తహసీల్దార్ వివరించారు. అగ్నిమాప కకేంద్రం ఏర్పాటు చేయడానికి ఉన్నతాధికారులకు నివిదిస్తానని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

‘పురం’లో మోస్తరు వర్షం



పట్టణంలో కురుస్తున్న వర్షం



ఫలారం గ్రామంలో జోరువాన

హిందూపురం టౌన్: పట్టణంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. సూర్యుడి భగభగలతో ఉదయం నుంచి ఎండ వేడిమి, ఉక్కపోతకు అల్లాడిన పట్టణ ప్రజలు కొంత ఉపశమనం పొందాడు. సాయంత్రం వేళ చల్లని గాలులు వీచాయి.

గుడిబండలో..

గుడిబండ: మండల వ్యాప్తంగా పలుచోట్ల గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. చాలా ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమైంది. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు కొంత ఉపశమనం పొందారు. దాదాపు 15 రోజుల నుంచి కనీస వర్షపాతం నమోదు కాలేదు. ఎట్టకేలకు మండల వ్యాప్తంగా పలు చోట్ల వర్షం కురవడంతో వేరుశనగ, రాగి, మొక్కజొన్న, తదితర పంటలు సాగు చేసే రైతులు హర్షం వ్యక్తం చేశారు.

21 నుంచి ఆంజనేయస్వామి ఉత్సవాలు

మడకశిరరూరల్: చందకచెర్లు గ్రామంలో వెలిసిన ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 21 నుంచి 23 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ ఈఓ నరసింహమూర్తి గురువారం తెలిపారు. 21న సీతారాముల కల్యాణోత్సవం, 22న హనుమాన్ జయంతి, జ్యోతుల ఉత్సవం, మధ్యాహ్నం స్వామి వారి బ్రహ్మరథోత్సవం, 23న స్వామి వారికి పంచామృతాభిషేకం, మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

లైంగిక వేధింపుల కేసులో ముగ్గురికి యావజ్జీవం

పావగడ: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని దొమ్మతమరి గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికపై లైంగిక వేధింపుల కేసులో ఆదే గ్రామానికి చెందిన వ్యక్తితోపాటు వారికి సహకరించిన ఇద్దర మహిళలకు తుమకూరు కోర్టు గురువారం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. కేసు వివరాలు.. దొమ్మతమరి గ్రామానికి చెందిన వెంకటేశ్, సుజాతల కుమార్తెను అతడి రెండో భార్య రత్నమ్మ, ఆమె తల్లి గంగమ్మ కుమ్మక్కై 2021 సెప్టెంబర్ 9న ఉదయం 10.30 గంటలకు ఇంట్లో చెప్పకనే నిందితులు చిరంజీవి, అరుణ్‌కుమార్ తెలంగాణలోని వరంగల్‌కు పిలుచుకెళ్లారు. అక్కడ ఓ షెడ్‌లో నివాసముండగా మైనర్ బాలికను అరుణ్‌కుమార్ లైంగిక వేధింపులకు గురి చేశాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో అరుణ్ కుమార్‌తోపాటు రత్నమ్మ, గంగమ్మలకు తుమకూరు కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అరుణ్ కుమార్ కు రూ 1.5 లక్షలు, రత్నమ్మ, గంగమ్మ లకు చెరో లక్ష రూపాయాలు జరిమానా విధించింది. ఇదిలా ఉండగా ప్రధాన నిందితుడు చిరంజీవి అప్పటికే మృతి చెందాడు.

టీడీపీకి వార్డు మెంబర్ రాజీనామా



వెంకటరమణనాయక్

పెనుకొండ రూరల్: టీడీపీకి చెందిన వార్డు మెంబర్ రాజీనామా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. శెట్టిపల్లి గ్రామానికి చెందిన 9వ వార్డు మెంబర్ వెంకటరమణ నాయక్ నాలుగేళ్లుగా 9వ వార్డు మెంబర్‌గా కొనసాగుతున్నారు. 40 ఏళ్లగా టీడీపీకి మద్దతుగా తమ కుటుంబం కొనసాగుతుందన్నారు. పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవలు చేశామన్నారు. గతంలో కూడా తన భార్య 10 వార్డు మెంబర్‌గా గెలుపొందిందన్నారు. ప్రస్తుత పరస్థితుల్లో రాజకీయాలకు స్వస్తి పలుకుతున్నట్లు ఆయన సోషల్ మీడియా వేదికగా విలేకరులకు తెలిపారు. దీనిపై కుటుంబ సభ్యులను సాక్షి వివరణ కోరగా శనివారం ఆయన రాజీనామా చేసేందుకు సిద్ధమైనట్లు తెలిపారు.

ఘనంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం

ధర్మవరం అర్బన్: వినియోగదారుల సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని జిల్లా వినియోగదారులు సమాచార కేంద్రం అధ్యక్షుడు సురేష్‌కుమార్, కార్యదర్శి కాకుమాని రవీంద్ర, ధర్మవరం అధ్యక్షుడు పల్లెం జనార్దన్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో గురువారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు వినియోగదారుల సంఘాలు ఎల్లప్పుడు ముందుంటాయన్నారు. అన్ని మండలాల్లో వినియోగదారుల సంఘాలు ఏర్పాటు చేసి నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామన్నారు.

పాకిస్తాన్ దుర్మార్గానికి తగిన శాస్తి



మాట్లాడుతున్న శృంగేరి శారదా పీఠాధిపతి

పావగడ: ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు మన సైనికులు తగిన శాస్తి చెప్పారని శృంగేరి శారదా పీఠాధిపతి చిన జగద్గురు విధు భూషణ భారతి స్వామిజీ అన్నారు. శృంగేరి స్వామిజీ విజయయాత్రను పురస్కరించుకుని స్థానిక రామకృష్ణ సేవాశ్రమంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయన మాట్లాడారు. మన దేశ పౌరులు, అందులోనూ సైనికుల ప్రాణాలు అత్యంత ముఖ్యమని, యుద్ధం జరిగితే రెండు వైపులా తీవ్ర ప్రాణనష్టాలు జరిగే ప్రమాదముందన్నారు. ఆ దృష్టితో యుద్ధ విరామానికి అంగీకరించడం మంచి నిర్ణయమని స్వామీజీ అభిప్రాయ పడ్డారు. సనాతన ధర్మాన్ని చాటేందుకు శంకరాచార్యులు దేశమంతా పర్యటించి పలు ధర్మోపదేశాలను చేశారని, 1200 ఏళ్ల గడిచినా నేటికి సనాతన ధర్మం జీవించడానికి కారణం శంకరాచార్యులు చూపించిన మార్గమేనని తెలిపారు. ఆరోగ్య, ఆధ్యాత్మిక సేలందిస్తున్న స్వామి జపానంద సామాజిక సేవలు అమూల్యం అనితరసాధ్యమన్నారు. అనంతరం స్వామి వివేకానంద గ్రామీణ సంఘటిత ఆరోగ్య కేంద్రంలో రాష్ట్రం లోనే గ్రామీణ ప్రాంతం లో మొదటి సారిగా నిర్మించిన శిశువులు, చిన్న పిల్లల అధునాతన నేత్ర చికిత్సాలయాన్ని శృంగేరి స్వామీజీ ప్రారంభించారు.

పెండింగ్ కేసులను పరిష్కరించండి



సూచనలిస్తున్న సీఐ జనార్దన్



అగళిలో చెక్ పోస్టును పరిశీలిస్తున్న డీఎస్పీ నరసింగప్ప

గుడిబండ: స్థానిక పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ నరశింగప్ప గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఎస్ఐ రాజకుల్లాయప్పకు ఆదేశించారు. అలాగే స్టేషన్ పరిసరాలను పరిశీలించి సీజ్ చేసిన వాహనాల వివరాలను తెలుసుకున్నారు. సీఐ రాజకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అమరాపురం: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం సాయంకాలం పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలం కర్ణాటక బార్డర్‌లో ఉందని, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మట్కా, గుట్కా, అక్రమ మద్యం, పేకాట తదితర వాటిపై నిఘా పెట్టాలన్నారు. మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్, ఏఎస్ఐ రామాంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

అగళి: మండలంలోని పీ బ్యాడగేర, నందరాజనపల్లి, ఆలూడి లో చెక్‌పోస్టులతోపాటు స్థానిక పోలీస్ స్టేషన్‌ను పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీఐ రాజ్‌కుమార్, ఏఎస్ఐ బషీర్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

లేపాక్షి: వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, రికార్డులను ఉంచుకోవాలని తెలిపారు. అదేవిధంగా ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలని సూచించారు. ముఖ్యంగా అధిక లోడ్లు వేయరాదని.. గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను తరలించకూడదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



గోకుల షెడ్డు పరిశీలిస్తున్న పీడీ విజయేంద్ర

అగళి: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని పీడీ విజయేంద్ర, ఏపీడీ లక్ష్మీనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని రామనపల్లిలో గోకుల షెడ్లను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పీడీ విజయేంద్ర మాట్లాడుతూ.. మండలంలో 200 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామ పంచాయతీల్లో ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని, అలా చేయని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అధిక సంఖ్యలో కూలీలను పనులు కల్పించాలన్నారు. పంచాయతీలకు ఇచ్చిన నివేదిక ప్రకారం పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మీనారాయణ, ఏపీఓ మంజునాథ , ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పొదుపు సంఘాలను బలోపేతం చేయండి



శిక్షణకు హాజరైన యానిమేటర్లు

రొళ్ల: గ్రామాల్లో పొదుపు సంఘాల బలోపేతానికి యానిమేటర్లు, వీఓ లీడర్లు కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఏసీ నాగరాజు, ఎల్‌సీ సీసీ లక్ష్మీకాంత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో యానిమేటర్లు, వీఓ లీడర్లకు యాక్షన్ ప్లాన్, ఫేస్‌యాప్ ఇతరాత్ర వాటిపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో అర్హత కలిగిన ప్రతి పొదుపు సంఘానికి పూర్తిస్థాయిలో రుణం ఇప్పించడానికి రికార్డులు సిద్ధం చేయాలని తెలిపారు. ఇదివరకే బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి ఇతరాత్ర వాటితో తీసుకున్న రుణాలను సక్రమంగా కట్టుకుంటే వడ్డీ భారం తగ్గుతుందని తెలిపారు. తర్వాత రికార్డుల నిర్వహణ, బ్యాంక్ లావాదేవీ, రికవరి ఇతరాత్ర వాటిపై చర్చించారు. ఎంఎస్ఏబీ గౌరమ్మ, జీహెచ్ ఆంజినేయులు, సీసీలు, యానిమేటర్లు, వీఓ లీడర్లు, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్యుల జయంతి

మడకశిర: పట్టణంలోని చీపులేటిలో గురువారం జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హోమం తదితర కార్యక్రమాలను చేపట్టారు.ఆదిశంకరాచార్యుల చిత్ర పటానికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు అనుమతి ఇవ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పావగడ: ఈ నెల 20 న జేసీటీయూ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెలో భాగంగా పావగడ లోనూ సమ్మె నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలని స్థానిక జేసీటీయూ నాయకులు తహసీల్దార్ వరదరాజును కోరారు. ఈ మేరకు వారు తహసీల్దార్ కు గురువారం వినతి పత్రం అందించారు. అలాగే సీఐ సురేశ్‌కు సైతం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా స్థానిక జేసీటీయూ నాయకులు నాగరాజు, రామాంజి, రామకృష్ణ, కృష్ణమూర్తి తదితర మహిళలు ఉన్నారు.

నేడు సాగునీటి సమస్యలపై అవగాహన సదస్సు

హిందూపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ‘సాగు నీటి సమస్యలు-పరిష్కార మార్గాలు’ అనే అంశంపై జలసాధన సమితి ఆధ్వర్యంలో సదస్సు జరగనుంది. శుక్రవారం తహసీల్దార్ ఆఫీసు వద్ద ఉన్న ఇందిరాపార్క్ పక్కన పెన్షనర్స్ భవన్‌లో ఉదయం 10 గంటలకు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి చైతన్య గంగిరెడ్డి, శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమానికి మేధావులు, రైతులు, యువత, ప్రజలందరూ హాజరై భవిష్యత్తులో సాగునీటి అవసరాలు, ఆవశ్యకత సమస్యల పరిష్కారాలపై సదస్సులో చర్చించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించడం జరుగుతుందన్నారు.

ఆరోగ్య సూత్రాలపై అవగాహన

మడకశిరరూరల్: హరేసముద్రం గ్రామంలో గురువారం నీలకంఠాపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఇంటింటా ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో పలువురికి అతిసారం లక్షణాలు ఉండడంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. డాక్టర్ జయవర్ధన్ మాట్లాడుతూ ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఒక వేళ ఎవరికైనా వ్యాధులు సోకితే వెంటనే వైద్య శిబిరంలో చికిత్సలు చేయించుకోవాలన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	34.0
పెనుకొండ	38.0
మడకశిర	34.0

డిప్లొమా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

లేపాక్షి: కర్ణాటక సరిహద్దులో ఉన్న కుడుమలకుంట పారిశ్రామిక ఆవరణలోని జీటీటీసీ ప్రభుత్వ డిప్లొమా కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హరీష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణతతో డిప్లొమా ఇన్ టూల్ అండ్ డై మేకింగ్, డిప్లొమా ఇన్ ప్రిసిషన్ మ్యానుఫాక్చరింగ్, డిప్లొమా ఇన్ మెకానిక్స్ కోర్సుల్లో చేరొచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 3 సంవత్సరాల కోర్సుతో పాటు మంచి కంపెనీల్లో ఒక సంత్సరం ఇంటర్న్‌షిప్ ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్న్‌షిప్ కాలంలో నెలకు రూ.18 వేల నుంచి 20 వేల వరకూ స్టైఫండ్ అందజేయడం జరుగుతుందన్నారు. కోర్సు పూర్తి అనంతరం వంద శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. బాలబాలికలకు విడిగా తగ్గింపు ధరలతో వసతి సౌకర్యం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 7349342369 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

మడకశిర: ఈనెల 19 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ భాస్కర్ గురువారం తెలిపారు. మడకశిర, గుడిబండ మండలాలకు చెందిన విద్యార్థులు మడకశిరలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కదిరేపల్లిలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో, రొళ్ల, అగళి మండలాల విద్యార్థులు రొళ్లలో, అమరాపురం మండలానికి చెందిన విద్యార్థులు అమరాపురంలో పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు హాల్ టికెట్లు కూడా వచ్చాయని తెలిపారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు, సామగ్రిని అందిస్తున్న దృశ్యం

పరిగి: మండలంలోని ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు స్థానిక దాత శ్యామ్ సుందర్ ఆర్థిక సౌజన్యంతో క్రీడా దుస్తులను వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి, పీడీ మహేష్ దీపక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సమ్మర్ కోచింగ్ క్యాంపులో పాల్గొంటున్న 20 మందికి క్రీడా దుస్తులను, పలు సామాగ్రిని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుకన్య శారదమ్మ, ఇందిరమ్మ, పద్మ పాల్గొన్నారు.